ప్రతి బస్సుకు ఫిట్‌నెస్ పరీక్షలు తప్పనిసరి

ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను అందజేస్తున్న ఆర్టీఓ కిష్టయ్య, తదితరులు

మన్సూరాబాద్, మే 17: ఆర్టీఏ నిబంధనల ప్రకారం ప్రతి స్కూల్, కాలేజ్ బస్సుకు ఫిట్‌నెస్ చేయించుకోవాలని ఆర్టీఏ ఈస్ట్ జోన్ ఆర్టీఓ ఎల్. కిష్టయ్య తెలిపారు. జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, కార్యదర్శి సి. రమేష్ ఆదేశాల మేరకు మలక్ పేట్ ఆర్టీఓ కిష్టయ్య ఆధ్వర్యంలో ఆర్టీఏ ఈస్ట్ జోన్ నాగోల్ కార్యాలయం ప్రాంగణంలో శనివారం స్కూల్, కాలేజ్ బస్సుల యాజమాన్యం, డ్రైవర్లకు బస్సు ఫిట్‌నెస్ నిబంధనలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కిష్టయ్య మాట్లాడుతూ, స్కూలు, కాలేజీ బస్సులను ఫిట్‌నెస్‌గా ఉంచుకోవడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ బస్సులను నడపాలని, అతివేగంతో నడిపి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో ఆర్టీఏ ఈస్ట్ జోన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు ఎం. బలరాం, ఆర్.రమేష్ బాబు, ఆర్.నరేందర్ పాల్ సింగ్, ఆర్.రాధిక పాల్గొన్నారు.

షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

షాదీ ముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

సైదాబాద్, మే 17: కోటి 20 లక్షల రూపాయల షాదీ ముబారక్ చెక్కులను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అందజేశారు. మలక్ పేట నియోజకవర్గంలోని చార్మినార్, అంబర్ పేట మండలాలకు చెందిన లబ్ధిదారులకు శనివారం పాతబస్తీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 120 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద ముస్లిం మైనార్టీ ప్రజలకు షాదీ ముబారక్ పథకం ఎంతో గాను దోద పడుతుందన్నారు. ఈ పథకాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ మండల తహసీల్దార్ మానవర్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

శివారు కాలనీల డ్రైనేజీ నిర్మాణానికి సహకరించండి

రైతులను కోరిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

వనస్థలిపురం, మే 17 : బీఎన్ రెడ్డి నగర్ డివిజన్‌లోని శివారు కాలనీల డ్రైనేజీ సమస్య పరిష్కారానికి నిర్మిస్తున్న ట్రంక్ లైన్ నిర్మాణానికి రైతులు సహకరించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కోరారు. అక్కడ జరుగుతున్న పనులను ఇటీవల రైతులు అడ్డుకోవడంతో ఆయన శనివారం రైతులను పిలిపించి తన కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. కాగా బృందావన్ మెడోస్ కాలనీ అధ్యక్షుడు శశికాంత్ తమ లేఅవుట్ పై దురుద్దేశంతో అధికారులకు ఫిర్యాదు చేస్తూ తమను ఇబ్బంది పెడుతున్నారని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని రైతులకు భరోసా ఇచ్చారు. వేలాది మంది ప్రజలకు అవసరమైన డ్రైనేజ్ ట్రంక్ లైన్‌కు అడ్డుపడవద్దని కోరారు. రైతుల తరపున హాజరైన కుక్కల యాదిరెడ్డి, కుక్కల చంద్రారెడ్డికు సమస్యను వివరించి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కాలనీ సంక్షేమ సంఘాలు ట్రంక్ లైన్ పూర్తి అయ్యేవరకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటిక రెడ్డి అరవింద రెడ్డి, మనోజ్ కుమార్, గౌరీశెట్టి, శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

సమావేశంలో పాల్గొన్న శివారెడ్డి, సుధాకర్ రావు, యాదగిరి గౌడ్, తదితరులు

ఆర్కే పురం, మే 17: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామని రాష్ట్ర అధ్యక్షుడు ఎం. శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి టీ. సుభాకర్ రావు, కోశాధికారి జి. యాదగిరి గౌడ్ పేర్కొన్నారు. శనివారం కొత్తపేటలోని బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌లో అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2025 -2028 మూడు సంవత్సరాల గాను నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి టి. సుభాకర్ రావు, కోశాధికారిగా జి. యాదగిరి గౌడ్, 5 మంది ఉపాధ్యక్షులు, 5 మంది సెక్రటరీలు, 8 మంది ఆర్గనైజింగ్ సెక్రటరీలు, 20 మంది కార్యవర్గ సభ్యు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న 5 డీఏలు, పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వ జేఏసీ ద్వారా డిమాండ్ చేస్తున్నట్లు వారు తెలిపారు. అన్ని ప్రైవేట్ హాస్పిటల్లో హెల్త్ కార్డుల పై వైద్యం అందించే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సంఘం ఆధ్వర్యంలో కుంట్లూరులో పెన్షనర్స్ కోసం వృద్ధాశ్రమాన్ని నడుపుతున్నామని తెలిపారు.

బీపీపై నియంత్రణ లోపిస్తే కీలక అవయవాలను దెబ్బ తీస్తుంది

సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శశాంక్

చాదర్‌ఘాట్‌లోని కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితంగా రక్తపోటు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మలక్‌పేట, మే 17: బీపీపై నియంత్రణ లోపిస్తే గుండె, కిడ్నీ, మెదడు వంటి కీలక అవయవాలను దెబ్బతీస్తుందని సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శశాంక్ అన్నారు. హైపర్ టెన్షన్ దినోత్సవం సందర్భంగా చాదర్ ఘాట్‌లోని కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం బీపీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా రక్తపోటు పరీక్షలు నిర్వహించి, హైపర్ టెన్షన్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధిక రక్తపోటుకు గురవకుండా ఉండాలంటే వ్యాయామం, ఆరోగ్యకర జీవన శైలి, ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. 30 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ బీపీని అదుపులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం

మేడ్చల్, మే 17 : ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి డిజి సాయిల్ గౌడ్ పార్టీ నేతలు, కార్యకర్తలకు సూచించారు . శనివారం వినాయక్ నగర్ కాలనీలో సీపీఐ నేత నారెడ్డి గౌతమ్ రెడ్డి కార్యాలయంలో మండల నాల్గో మహాసభ నారెడ్డి శశిధర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25న ఉప్పల్ మండలంలోని ఈసీఐఎల్ పార్టీ కార్యాలయం దగ్గరలోని బంజారా ఫంక్షన్ హాల్ లో జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని, 400 మంది ప్రతినిధులు హాజరయ్యే సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ సత్యం, కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్ బోసు హాజరవుతున్నారన్నారు. రాష్ట్ర మహాసభలు ఆగస్టులో 19 నుంచి 22వరకు కుత్బుల్లాపూర్‌లో జరుగున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగయ్య, నాయకులు రమేష్, వెంకటాచారి, అశోక్, రాజయ్య, ఆంజనేయులు, పూర్ణచంద్ర, మహమ్మద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 1054 దరఖాస్తులు

కీసర, మే 17: భూభారతి చట్టం కింద మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మొత్తం ప్రజల నుంచి 1054 దరఖాస్తులను వచ్చినట్లు ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి తెలిపారు. ఈనెల 5 నుంచి 13వ తేదీ వరకు దమ్మాయిగూడ, నాగారం మున్సిపాల్టీ పరిధిలోని కీసర మండలంలో విజయవంతంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించామన్నారు.

కీసర గ్రామం నుంచి అత్యధికంగా 243 దరఖాస్తులు రాగా, చీర్యాల్ నుంచి 107, కీసర దాయర నుంచి 97, యాద్గార్‌పల్లి ఈస్టు నుంచి 96, యాద్గార్‌పల్లి వెస్ట్ నుంచి 85, భోగారం నుంచి 87, రాంపల్లి నుంచి 89,కుందన్‌పల్లి నుంచి 40, నాగారం నుంచి 37, తిమ్మాయిపల్లి నుంచి 34, గోధుమకుంట నుంచి 35, ధర్మారం నుంచి 47, నర్సంపల్లి నుంచి 33, హరిదాస్‌పల్లి నుంచి 19, అహ్మద్‌గూడ నుంచి 5 దరఖాస్తుల చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రతి దరఖాస్తును భూభారతి పోర్టల్‌లో నమోదు చేసి క్షేత్రస్థాయిలో పరిశీలించి, నోటీసులు జారీ చేసిన అనంతరం వారం రోజుల్లో చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల చివరికల్లా దరఖాస్తులకు పరిష్కారం చేపడుతామన్నారు.

ప్రభుత్వ సూచనల ప్రకారం ఇళ్లను నిర్మించుకోవాలి

మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి

కందుకూరు, మే 17 : ప్రభుత్వ సూచనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని నేదునూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి రాకేష్ గౌడ్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. మండల పరిషత్ మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్ రెడ్డి, మండల కోఆర్డినేటర్ అఫ్జల్ బేగ్‌తో కలిసి మాట్లాడుతూ, ప్రభుత్వ ప్లాన్ ప్రకారం ఇళ్లు కట్టుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్దేశించిన స్థలంలో మాత్రమే ఇళ్ల నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణంలో జాప్యం చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ డైరెక్టర్లు బాలయ్య. జి.సంజీవరెడ్డి. వి. మంజుల. నాగరాజు. గ్రామ అధ్యక్షుడు బొర్ర సురేష్, మైనార్టీ అధ్యక్షుడు ఎండీ పర్వేజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాబు. దర్శన్. ఎండీ అజారుద్దీన్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఐదేళ్ల ఎంబీఏ ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను సంబంధిత కళాశాల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చని చెప్పారు. రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈ నెల 30వ తేదీలోగా టీఏస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్ష జవాబు పత్రాల నకలు పొందగోరేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 26వ తేదీ వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఈవినింగ్ ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఈవినింగ్ ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (ఈవినింగ్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్మెంట్) (ఈవినింగ్) కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షల ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) (ఐడీ, హెచ్ఐ, ఎల్డీ, ఏఎస్డీ) కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈ నెల 27వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని పేర్కొన్నారు. రూ.200 అపరాధ రుసుంతో 30వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఇతర వివరాలకు www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఇద్దరు బాలురు అదృశ్యం

తప్పిపోయిన బాలురు

హయత్ నగర్, మే 17 : మదర్సా నుండి ఓ ఇద్దరు బాలురు అదృశ్యమైన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్, హతిగూడలో మిస్బాహుల్ హుడా రహిమియా మదరసలో హబీబుల్లా(13), సఫీయుల్ల(11) బీహార్ నుండి వచ్చి చదువుతున్నారు. ఏప్రిల్ నెలలో ఇద్దరు బాలురు కూడా వారి స్వస్థలం బీహార్ వెళ్లగా ఈనెల 6న తండ్రి మహమ్మద్ ఇజ్రాయిల్ వదిలి వెళ్లాడు. 8న ఉదయం 9 గంటలకు ఇద్దరు బాలురు ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయారు. వారి గురించి చుట్టుపక్కల ప్రాంతాలలో, సొంత గ్రామాల్లో ఆచూకీ కోసం వెతికినా దొరకలేదు. తండ్రి మహమ్మద్ ఇజ్రాయిల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్కుల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

మల్కాజిగిరి, మే 17: పార్కుల్లో మౌలిక వసతులు కల్పిస్తామని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం రాంనగర్ కాలనీలో ఏర్పాటు చేస్తున్న పార్కు నిర్మాణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పార్కులో వాకింగ్ ట్రాక్, పిల్లల ఆటస్థలం, ఓపెన్ జిమ్, ల్యాండ్ స్కేప్ గార్డెన్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలోఈ ఈ శ్రీకాంత్, డీఈ ప్రశాంతి, ఏఈ వరుణ్ దేవ్, సాజిద్, కాలనీవాసులు బాలసుబ్రమణ్యం, రాజశేఖర, రాఘవరెడ్డి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి దేశవ్యాప్తంగా 'కృషి సంకల్ప్ అభియాన్'

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో జరిగిన సమావేశంలో క్రీడా డైరెక్టర్ వినోద్ కుమార్ సింగ్, తదితరులు

సైదాబాద్, మే 17: కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) అభివృద్ధి చేసిన కృషి సంకల్ప్ అభియాన్ దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని సెంట్రల్ డ్రైలాండ్ వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రీడా)డైరెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సింగ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 29 నుండి జూన్ 12 వరకు దేశవ్యాప్తంగా 700 పైగా జిల్లాల్లో కొనసాగుతుందని కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమం గ్రామీణ అభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో జరిగిన సమావేశంలో ప్రకటించారని ఆయన తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, మంత్రిత్వ శాఖ అధికారులు, ఉద్యోగులు, స్థానిక కార్మిక సంఘాలతో బృందాలుగా ఏర్పాటు చేసి ప్రతి రోజు వివిధ గ్రామాలను సందర్శిస్తారని ఆయన తెలిపారు. రైతులతో నేరుగా సంభాషించి వ్యవసాయం గురించి అవగాహన కల్పించి, తగిన సలహాలను ఇస్తారన్నారు. ప్రయోగశాల నుండి భూమికి అనే మంత్రాన్ని సహకారం చేసుకునేందుకు జరుగుతున్న ఈ అభియాన్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఆధునిక, ఆదర్శ వ్యవసాయంతో పాటు 'ఒక దేశం, ఒక వ్యవసాయం, ఒక బృందం' అనే నినాదంతో దేశవ్యాప్తంగా 731 ఖుషి విజ్ఞాన కేంద్రాలు 100కు పైగా ఐసీఏఆర్ కేంద్రాలకు చెందిన అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని రైతుల వద్దకు నేరుగా వెళ్లి క్షేత్రస్థాయిలో అధికారులు వివిధ అంశాలపై చర్చించి సలహాలు ఇస్తారని, అదేవిధంగా రైతుల సందేహాలను పూర్తి నివృత్తి చేస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ కార్యదర్శి దినేష్ చతుర్వేది, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ వ్యవసాయ పరిశోధన విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ మంగిలాల్ జాట్ పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

నిధులు మంజూరు

రామంతాపూర్ ,మే 17: రామంతాపూర్ డివిజన్‌లోని ఆనందనగర్‌లో రజకసేవా సం ఘం ధోబీఘాట్ దగ్గర ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణానికి రూ.32 లక్షలు మంజూరు చేయించామని డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు తెలిపారు. శనివారం ఆ పనుల ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రజక సంఘం ప్రతినిధులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, రజక సంఘం అధ్యక్షులు దానయ్య, పవన్, జిత్తు, శంభు లింగం, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు క్రికెట్ కిట్లు పంపిణీ

రామంతాపూర్, మే 17: రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు వేసవి సెలవుల్లో పిల్లలకు ఆనందంగా గడిపేందుకు సమ్మర్ క్రికెట్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా పిల్లలు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న పేరిణి నృత్యం

రామంతాపూర్ ,మే 17:ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం శ్రీ చంద్ర కళా నిలయం పేరిణి ,ఆంధ్ర నాట్యం గురువు సంతోష్ పెరుమాండ్ల శిష్య బృందం నృత్యం ఆహుతులను ఆకట్టుకుంది. పుష్పాంజలి, దేవి కైవారం, నారాయణతే నమో, నమో, మూషిక వాహన, ఇదిగో భద్రాద్రి, తిల్లాన, మహ గణపతిమ్, కొండలలో నెలకొన్న, సం ధ్య తాండవం, ముద్దుగారే యశోద, సాహి త్య పల్లవి, దశావతారములు అంశాలను కృతిక రెడ్డి, మనోజ్ఞ, వైష్ణవి, అక్షర, ప్రవస్తి, సంజన, హరిణి, మధుప్రియ, రశ్మిత, దీక్షిత్ , అమృతవల్లి, నందిత, భువన, గ్రీష్మ శ్రీ, అమూల్య, సుహాని కీర్తనలు ప్రదర్శించి మెప్పించారు.

సూక్తులు రాసి.. శుభ్రత మరిచారు?

- బడంగ్‌పేట్ మున్సిపల్ గ్రౌండ్‌లో దుస్థితి

కాంపౌండ్ వాల్‌కు లక్షలు పెట్టి సూక్తులు రాసి, శుభ్రత మరిచిన వైనం



గ్రౌండ్‌లో ఎక్కడ చూసినా విరిగిపోయిన బెంచీలు

గ్రౌండ్‌లో రాళ్ల రప్పలు

బడంగ్‌పేట్, మే 17: బడంగ్‌పేట్‌లో ఉన్న సిరిపురం యాదయ్య మున్సిపల్ గ్రౌండ్‌లో లక్షలు ఖర్చు చేసి కాంపౌండ్ వాల్‌కు సూక్తులు రాసి శుభ్రతను మర్చిపోయారు. మున్సిపల్ గ్రౌండ్ చుట్టూ ఉన్న కాంపౌండ్ వాల్ కు రూ. 15 లక్షలతో రకరకాల సూక్తులు, కొటేషన్లతో నింపేశారు. అవగాహన కల్పించడానికి రకరకాల ప్రతిమలను వేశారు. ఆ ప్రతిమలను చూడడానికి బాగానే ఉన్నాయి. ఇది మంచి నిర్ణయమే. వివిధ రకాల సూక్తులతో ప్రజలకు అవగాహన కల్పించడం మంచిదే అయినప్పటికీ సూక్తులు ఏ విధంగా అయితే రాశామో శుభ్రత కూడా అదే విధంగా పాటిస్తే బాగుండేదాని వాకర్స్ నరసింహ, యాదయ్య, రఘుపతి, తదితరులు పేర్కొంటున్నారు. గ్రౌండ్లో ఉన్న రాళ్లు, రప్పలను అనేకమార్లు మేమే తొలగించామని వారు పేర్కొంటున్నారు. లక్షలు ఖర్చుపెట్టి సూక్తులు రాసేటప్పుడు శుభ్రంగా చెయ్యక పోతే అనేక రకాల సమస్యలు వస్తాయన్న సందేహాలు వస్తున్నాయి. గ్రౌండ్ లో ఎక్కడ చూసినా విరిగిపోయిన సిమెంటు బెంచీలే కనిపిస్తున్నాయి. వాకర్స్ కూర్చోవడానికి ఏమీ లేక అక్కడ ఇక్కడ రాళ్లు పెట్టి మధ్యన కట్టెలు పెట్టి కూర్చుంటున్నారు. గ్రౌండ్లో పిచ్చి మొక్కలు, చెత్త కాగితాలు దర్శనమిస్తున్నాయి. వాకింగ్ చేస్తుంటే దుమ్ము లేచిపోతోందని వాకర్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రౌండ్ లో ఎక్కడ చూసినా అపరిశుభ్రత నెలకొన్నదని వాకర్స్ ఆరోపిస్తున్నారు. గ్రౌండ్లో ఎక్కడ కూడా టాయిలెట్స్ లేకపోవడంతో వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు. ప్రతిరోజు 300 నుంచి 500 మంది మున్సిపల్ గ్రౌండ్‌లో వాకింగ్ చేయడం, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ గేమ్స్ కూడా ఆడుతున్నారు. ఏ గేమ్ ఎప్పుడు ఆడాలో మున్సిపల్ అధికారులు నిబంధన పెట్టకపోవడం వలన చిన్నపిల్లలకు, వృద్ధులకు ఇబ్బంది అవుతోంది. మార్నింగ్, ఈవినింగ్ క్రికెట్ ఆడటం వలన బాల్ ఎక్కడ తగులుతుందోనని మహిళలు సైతం ఇబ్బంది పడుతున్నారు. గ్రౌండ్‌లో ఉన్న సమస్యలను ఎవరూ పట్టించుకోకపోవడంతో వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు. వాకింగ్ చేయడానికి, వ్యాయామం చేయడానికి అనుకూలంగా ఉండే విధంగా తీర్చిదిద్దాలని పలుమార్లు వాకర్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా కూడా అధికారులు ఎవరు దృష్టి పెట్టకపోవడంతో గ్రౌండ్ అంతా అస్తవ్యస్తంగా ఉందని వాకర్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు గ్రౌండ్ ను పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని వాకర్స్ కోరుతున్నారు. రాత్రి అయ్యిందంటే గ్రౌండ్ మందుబాబులకు నిలయంగా మారుతోంది. అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి మున్సిపల్ గ్రౌండ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

పారిశుధ్యం లోపించకుండా చర్య తీసుకుంటాం

మున్సిపల్ గ్రౌండ్‌లో ఉన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తా. పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటాం. సిబ్బందికి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాము. సమస్యలను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాను.

– వంకాయల యాదగిరి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్

సమస్యలను పరిష్కరించాలి

మున్సిపల్ గ్రౌండ్‌లో అనేక సమస్యలు ఉన్నాయి. వాకింగ్ చేసుకోవడానికి ఇబ్బందికరంగా ఉంది. కాలక్షేపం కోసం కూర్చుందాం అన్న బెంచీలు లేవు. ఎక్కడ చూసినా పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. వాకింగ్ చేసే టైమ్‌లో క్రికెట్ ఆడడానికి అనుమతించకూడదు. క్రికెట్ ఆడటం వలన వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు ఇబ్బంది పడుతున్నారు. వారికి ఒక సమయం ఇవ్వండి. బాల్ ఎక్కడ తగులుతుందోనని ఇబ్బంది పడుతున్నారు. గ్రౌండ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరుతున్నాం.

– నరసింహ, రిటైర్డ్ టీచర్

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు సంబంధించిన వారికి తెలియజేయడమేమనగా, నా క్లయింట్ అయినా శ్రీ యం. తిమ్మయ్య గుప్తా తండ్రి యం.శేషయ్య గుప్తా వయస్సు 90 సంవత్సరాలు, వృత్తి వ్యాపారము, నివాసము 104, జగన్నాథ అపార్ట్మెంట్, St.No.6, విద్యానగర్, హైదరాబాద్. ప్రస్తుత నివాసము ఇం.నెం. 1-6-40, రైల్వే స్టేషన్ రోడ్, మహబూబ్ నగర్ ప్రాపర్ మరియు జిల్లా తరపున - నా క్లయింట్ అయినా యం. తిమ్మయ్య గుప్తా గారు సర్వే నెం.21, విస్తీర్ణం ఎ.4-04 గుం.లు మరియు సర్వేనెం.34/A, విస్తీర్ణం ఎ.0-20 గుం.లు సరలారావుపల్లి గ్రామము, మండలం కందుకూర్, రంగారెడ్డి జిల్లా గల భూములకు యజమాని మరియు కబ్జాదారుడుగా ఉండి తనతో పాత పరిచయము ఉన్న J.R.S. Reddy తండ్రి సుబ్బారెడ్డి జి రెడ్డి, జూబ్లీహిల్స్, హైదరాబాద్ అను వ్యక్తి తన భూములను తనకి అగ్రిమెంట్ ఆఫ్ సేల్ కం జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ డాక్యుమెంట్ 916/2010, తేదీ 5-3-2010 అని చేసి నా క్లయింట్ రిజిస్టర్ చేసినట్లుగా తప్పుడు డాక్యుమెంట్ చేయించుకొని, ఎన్నిసార్లు పై డాక్యుమెంట్ క్యాన్సల్ చేస్తానని చేయడం లేదు. అట్టి డాక్యుమెంట్ గురించి మా క్లయింటుకు ఈమధ్యలో తెలిసినందున లీగల్ నోటీస్ ఇవ్వడం జరిగింది. కావున పై డాక్యుమెంట్ ద్వారా ఎలాంటి లావాదేవీలు నడిపిన చెల్లనేరవు. ఇందుకు విరుద్ధంగా ఇలాంటి లావాదేవీలు నడిపించిన మాచే తీసుకొనబడే చట్టపరమైన సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులు అగుదురు.

తేదీ:17-05-2025

మహబూబ్‌నగర్

K. ANAD RAO B.Com., LL.B.,
K. SAITEJA ADVOCATES,
1-2-123/3/C, Station Road
Mahabubnagar. Cell: 9441016518